క్లుప్తంగా

వాలీబాల్ క్రీడాభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న బైరెడ్డి శబరి

కర్నూలు (న్యూటౌన్): వాలీబాల్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరెడ్డి శబరి అన్నారు. శనివారం కర్నూలు మండలం ఈ తాండ్రపాడు గ్రామంలోని టీజీవీ నగర్‌లో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయన్నారు. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో నందికొట్కూరు, కోడుమూరు బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జ్‌లు చిన్న సుంకన్న, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు తిమ్మందొడ్డిలో వేడుక

సి.బెళగల్: మండల పరిధిలోని తిమ్మందొడ్డి గ్రామంలో ప్రతి సంవత్సరం సంక్రాంతి వేడుకలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. సమీపంలోని తుంగభద్ర నదిలో నందీశ్వరుడు వెలిసడంతో ప్రజలు వేడుకను అక్కడే జరుపుకుంటారు. గ్రామస్తులందరూ నది వద్దకు చేరుకుని నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. నేడు మకర సంక్రాంతి సందర్భంగా వేడుకలు జరుగనున్నాయి. పొరుగు గ్రామాలైన చింతమానుపల్లె, సంగాల, పలుకుదొడ్డి, నందవరం మండలం రాయచోటి, గురుజాల గ్రామాల నుంచి తిలకించేందుకు యువకులు పెద్ద సంఖ్యలో రానున్నారు.

భక్తిశ్రద్ధలతో మీరసావలి ఉరుసు


అలంకరించిన మీరసావలి స్వామి దర్గా

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురం గ్రామంలో మీరసావలి నాజర్ షరీఫ్ ఉరుసును శనివారం భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. ముందుగా నూతనంగా నిర్మించిన దర్గాను పీఠాధిపతులు పునఃప్రారంభించారు. అనంతరం భక్తులు దర్గాను దర్శించుకుని ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. ఉరుసు సందర్భంగా నేడు కబడ్డీ పోటీలు, రాత్రి ఖవ్వాలి ప్రదర్శన, 16న జియారత్ నిర్వహిస్తున్నట్లు దర్గా నిర్వాహకులు షరీఫ్‌మియా తెలిపారు.

26న ట్రాక్టర్ల ర్యాలీ

నంద్యాల(అర్బన్): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త ర్యాలీలో భాగంగా నంద్యాల జిల్లాలో ఈనెల 26వ తేదీన చేపట్టనున్న ట్రాక్టర్ల ర్యాలీని విజయవంతం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక శ్రీనివాస కాంప్లెక్స్‌లోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో రైతు సంఘం నాయకులతో సమావేశం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ రైతాంగం ఉద్యమ విరమణ సందర్భంగా ప్రధాని మోదీ ఇచ్చిన హామీలు ఒక్కటి అమలు కాలేదన్నారు. రిపబ్లిక్‌డే సందర్భంగా రైతు సంఘాలన్నీ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన తెలియజేయాలని నిర్ణయించాయన్నారు. మండల నాయకులు అల్లాబకాష్, సోమన్న, వీరేంద్రప్ప, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రఫీ, చౌడప్ప, మహమ్మద్, ఖాజామియా పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసన

కర్నూలు(సెంట్రల్): స్వచ్ఛంధ్ర ప్రదేశ్ క్లాప్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రెండో రోజు నిరసన ప్రదర్శనలను కొనసాగించింది. శనివారం పున్నమి గెస్టు హౌస్ సమీపంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, కార్యదర్శి మార్రెళ్ల రామాంజనేయులు, క్లాప్ డ్రైవర్ల యూనియన్ ప్రధాన కార్యదర్శి రఘు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది. డ్రైవర్లకు వెంటనే పెండింగ్‌లో జీతాలు విడుదల చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలన్నారు.

ఎవర్‌గ్రీన్ హీరో శోభన్ బాబు

కర్నూలు(సెంట్రల్): సినీ హీరో శోభన్ బాబు ఎవర్ గ్రీన్ హీరో అని జిల్లా శోభన్ బాబు అభిమానుల సంఘం అధ్యక్షుడు ఎం.సుధాకర్ బాబు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఆయన జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వేలాదిగా అభిమానులు హాజరయ్యారు. ముందుగా శోభన్‌బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సుధాకర్ బాబు మాట్లాడుతూ సినిమారంగంలో అందగాడిగా పేరు తెచ్చుకున్న ఏకైక హీరో శోభన్ బాబు అన్నారు. ఆయన పేరిట చేస్తున్న సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామన్నారు.

మహానందిలో నేడు సంక్రాంతి మహోత్సవాలు

మహానంది: సంక్రాంతి పర్వదినం సందర్భంగా మహానందిలో ఆదివారం విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ ఆదివారం శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామివార్లకు విశేష అభిషేకార్చనలు, ఉత్సవమూర్తులకు తిరుమంజన సేవలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అలాగే 16వ తేదీన కనుమ సందర్భంగా పార్వేట ఉత్సవం, ముగ్గుల పోటీలు ఉంటాయన్నారు.

అవనిపై హరివిల్లు


గూడూరులో ఇంటి ముందు అందమైన ముగ్గు వేసిన మహిళలు

సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శనివారం భోగి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంస్కృతి, సంప్రదాయాలను కొనసాగిస్తూ మహిళలు తెల్లవారుజామునే ఇళ్ల ముందు కళ్లాపిచల్లి రంగురంగుల ముగ్గులు వేశారు. వాటిలో గొబ్బెమ్మలను ఉంచి అందంగా అలంకరించారు.

–సాక్షి, నెట్‌వర్క్


సి.బెళగల్‌లో సుందర నెమలి ముగ్గుకు రంగులు అద్దుతున్న దృశ్యం


గడివేములలో...

సంప్రదాయాల వేడుక సంక్రాంతి

- ముగ్గులు చూస్తుంటే గ్రామీణ ప్రాంతాలు గుర్తుకొస్తున్నాయి
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబం సంక్రాంతి పండుగ అని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం 34వ వార్డులోని నిర్మల్‌నగర్, వాసవీనగర్‌లలో స్థానిక కార్పొరేటర్ ఎరుకల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్న ఈ పోటీలను ఎమ్మెల్యే కాటసాని, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, మహిళ కార్పొరేటర్లు గాజుల శ్వేతారెడ్డి, సాపురు మాధురి హాజరై పరిశీలించారు. పోటీలలో విజేతలకు మొదటి బహుమతిగా డబుల్ డోర్ ఫ్రిజ్(రాజేశ్వరి), రెండో బహుమతిగా వాషింగ్ మిషన్ (ఆమని), మూడో బహుమతిగా టీవీ (మహేశ్వరి), నాలుగో బహుమతిగా గ్రైండర్ (శోభారాణి), ఐదో బహుమతిగా మిక్సీ (లక్ష్మీప్రసన్న) అందజేశారు. మరో ఐదుగురికి ప్రత్యేక బహుమతులుగా కుక్కర్‌లు, మిగతా వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముగ్గులను చూస్తేంటే పల్లెలు గుర్తుకొస్తున్నాయన్నారు. ఈ ఏడాది రైతులకు బాగా కలిసి వచ్చిందన్నారు. పంటలు బాగా పండాయన్నారు. ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా అండగా నిలబడుతుందని చెప్పారు. 34వ వార్డులో పొదుపు సంఘాల మహిళల కోరిక మేరకు కమ్యూనిటీ హాల్ నిర్మిస్తానని హామీ ఇచ్చారు.అనంతరం ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.


ముగ్గుల పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన రాజేశ్వరికి ఫ్రిజ్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కార్యక్రమంలో కార్పొరేటర్లు సంగాల సుదర్శన్‌రెడ్డి, ఇప్పల నారాయణరెడ్డి, కో ఆప్షన్ సభ్యులు కృష్ణమూర్తి, వార్డుల ఇన్‌చార్జ్‌లు శ్రీధర్‌రెడ్డి, సాపురు వీరయ్య, నాయకులు మల్లేల పుల్లారెడ్డి, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

- 19వ వార్డులో శ్రీ లక్ష్మి నరసింహా స్వామి దేవస్థానంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కాటసాని హాజరై ప్రారంభించారు. ముందుగా స్వామికి ప్రత్యేకంగా పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తమ్మరాజుపల్లెలో

పాణ్యం: తమ్మరాజుపల్లె గ్రామంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. నంద్యాల జిల్లా డీపీఓ శ్రీనివాసులు ఈ ముగ్గులను పరిశీలించి మన సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. రెండు రోజుల పాటు ఆట, పాట పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ బత్తుల విజయగౌరి తెలిపారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ భాస్కర్‌రావు, ఎంపీటీసీ సభ్యులు వెంకటేశ్వర్లు, నాయకులు శేషారెడ్డి, షేక్షావలి, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమానికి హాజరైన మహిళలు

కనుల పండువగా గోదాదేవి కల్యాణం

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లులో గోదాదేవి సమేత రంగనాథస్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. ధనుర్మాసాన్ని పురస్కరించుకుని స్థానిక చెన్నకేశవస్వామి దేవస్థానంలో శనివారం సాయంత్రం స్వామి కల్యాణం నిర్వహించారు. ఆలయ ఈఓ మద్దిలేటి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ముందుగా ఆలయ అర్చకులు నారాయణస్వామి స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, కల్యాణ తంతును కనుల పండువగా జరిపించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల తరుపున గ్రామస్తులు పెళ్లి పెద్దలుగా వ్యవహరించారు.


చెన్నకేశవస్వామి ఆలయంలో అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

బైక్‌ల దొంగ అరెస్ట్

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలో పలు ప్రాంతాల్లో ఐదు బైక్‌ల చోరీకి పాల్పడిన నిందితుడిని తాలూకా పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని జగజ్జననీ నగర్‌లో నివాసం ఉంటున్న షేక్ మహమ్మద్ వలి ఆటోనగర్‌లో బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అప్పులు ఎక్కువగా ఉండటంతో మెకానిక్ పని చేసిన డబ్బులు సరిపోకపోవడంతో చోరీలకు పాల్పడ్డాడు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో నంబరు ప్లేట్లు లేని వాహనాలను దొంగలించాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం ఆటోనగర్ సమీపంలో నిందితుడిని గుర్తించి పట్టుకున్నారు. చోరీకి గురైన బైక్‌లను స్వాధీనం చేసుకొని మహమ్మద్ వలిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

హ్యాండ్‌బాల్ పోటీల్లో నంద్యాల జట్టు ప్రతిభ

గన్నవరం: కృష్ణా జిల్లాలోని గన్నవరం జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న అంతర్ జిల్లాల 37వ సబ్ జూనియర్, 44వ జూనియర్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీలు శనివారం ముగిశాయి. పోటీల్లో సబ్ జూనియర్, జూనియర్ విభాగాల విజేతగా విశాఖపట్నం, రన్నర్స్‌గా నంద్యాల జట్లు నిలిచాయి. జూనియర్ విభాగంలో తృతీయ స్థానంలో కర్నూలు, విజయనగరం జట్లు, సబ్ జూనియర్స్ విభాగంలో అనంతపురం, తూర్పు గోదావరి జట్లు తృతీయ స్థానం సాధించాయి. అనంతరం వరుసగా మూడు స్థానాల్లో నిలిచిన జట్లకు ఒలింపిక్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేపీ రావు, ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టీఎస్ఆర్‌కే ప్రసాద్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ మెడల్స్, ట్రోఫీలు అందజేశారు. నాలుగేళ్లుగా నిలిచిపోయిన హ్యాండ్‌బాల్ పోటీలను విజయవంతంగా నిర్వహించిన ఉమ్మడి కృష్ణా జిల్లా అసోసియేషన్‌ను కేపీ రావు అభినందించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి జె.సింహాచలం, కోశాధికారి టి.శిరీష, బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యప్రసాద్ పాల్గొన్నారు.

యువకుడి నేత్రదానం

కర్నూలు(హాస్పిటల్): రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతిచెందిన యువకుడి నేత్రాలను కుటుంబ సభ్యులు శనివారం దానం చేశారు. నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలం కరివెన గ్రామానికి చెందిన చిట్టిబాబు కుమారుడు సుబ్బన్న(28) పోలీసు శాఖలో చేరేందుకు శిక్షణ తీసుకుంటున్నాడు. అందులో భాగంగా ఈనెల 12న పోలీసు శాఖ నిర్వహించే అర్హత పరీక్షకు అవసరమైన పుస్తకాలను తీసుకుని స్వగ్రామానికి వెళ్తుండగా కరివెన గ్రామ సమీపంలో ఆర్టీసీ బస్సు అతని మోటర్‌సైకిల్‌ను ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆ యువకుడిని కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా శనివారం తెల్లవారుజామున మృతిచెందాడు. తమ కుమారుడు లేకపోయినా అతని నేత్రాలు మరొకరికి ఉపయోగపడతాయనే ఉద్దేశంతో అతని కంటి నుంచి కార్నియాను సేకరించి దానం చేశారు.


సుబ్బన్న నేత్రాలను మార్చురీ వద్ద దానం చేస్తున్న కుటుంబ సభ్యులు

నేడు ఎస్టీ కమిషన్ సభ్యుడి రాక

నంద్యాల(అర్బన్): రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్య శంకర్‌నాయక్ ఆదివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించనున్నారని జీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ముందుగా స్థానిక జీపీఎస్ కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశమై గిరిజన తండాలు, ఎరుకల కాలనీలు, చెంచుగూడేలు, యానాది కాలనీల్లో నెలకొన్న సమస్యలపై చర్చిస్తారని పేర్కొన్నారు. 15న అవుకు, బనగానపల్లె మండలాల్లో రెండు రోజుల పాటు, 17న నంద్యాల, ఆత్మకూరు, కొత్తపల్లి మండలాల్లో పర్యటిస్తారని వివరించారు.

వైఎస్సార్‌సీపీలోనే బీసీలకు రాజకీయ లబ్ధి

కర్నూలు(అర్బన్): రాష్ట్రంలో బీసీ కులాలకు వైఎస్సార్‌సీపీ ద్వారానే రాజకీయ లబ్ధి సాధ్యమవుతున్నదని పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీహెచ్ మద్దయ్య, బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల లక్ష్మీకాంతయ్య అన్నారు. శనివారం స్థానిక బీసీ భవన్‌లో ఆరేకటిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి. కృష్ణోజీరావు ఆధ్వర్యంలో ఆరేకటికల కుల దైవం ధర్మవ్యాధ మహర్షి విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన నేతలు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీ కులాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, 56 బీసీ కులాలకు ప్రత్యేకంగా కార్పొరేషన్లు ఏర్పాటు చేశారన్నారు. ఆరేకటికలకు కూడా గుర్తింపు ఇస్తూ జిల్లాలో నలుగురికి ఆరేకటిక కార్పొరేషన్ డైరెక్టర్లుగా పదవులు ఇచ్చారన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ తదితర బడుగు, బలహీన వర్గాలకు అన్ని విధాలుగా న్యాయం చేస్తున్నారన్నారు.

20 నుంచి భక్తి సమ్మేళనం

కర్నూలు కల్చరల్: రామకృష్ణ - వివేకానంద భావ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈనె 20 వ తేదీ నుంచి మూడు రోజుల పాటు రాష్ట్ర 5వ భక్తి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కార్యదర్శి డాక్టర్ కె.జి. శరత్ చంద్రబాబు పేర్కొన్నారు. శనివారం ఓల్డ్‌సిటీలోని రామకృష్ణ సేవా సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సమ్మేళనానికి సంబంధించిన ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామకృష్ణ పరమ హంస ప్రబోధనలు, వివేకానంద స్ఫూర్తి వచనాలతో నేటి తరాన్ని మేల్కొపేందుకు ఈ సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నామన్నారు. వీఆర్ కాలనీలోని వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో 20 నుంచి 22 వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు జరిగే సమ్మేళనంలో రామకృష్ణ మిషన్, మఠాలకు చెందిన 15 మంది స్వామీజీలు, ఇద్దరు మాతాజీలు పాల్గొని ఆధ్యాత్మిక సందేశాలు ఇస్తారన్నారు. సుమారు 2000 మంది పాల్గొంటారన్నారు. సమావేశంలో సమితి నగర అధ్యక్షుడు కేజీ గోవిందరెడ్డి, కర్నూలు కన్వీనర్ సుధాకర్, సభ్యులు జయంతి వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.


భక్తి సమ్మేళనం ప్రచార పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కె.జి.శరత్ చంద్రబాబు, ఇతర సభ్యులు

సింగోటానికి బస్సు సర్వీసులు

ఆత్మకూరు:తెలంగాణ రాష్ట్రం కొల్లాపురం మండలంలోని సింగోటం గ్రామంలో జాతరకు ఆత్మకూరు ఆర్టీసీ డిపో నుంచి శనివారం ప్రత్యేక బస్సు సర్వీసులను ప్రారంభించారు. ఆర్టీసీ డిపో మేనేజర్ మహేంద్రుడు మాట్లాడుతూ.. ఈనెల 18వ తేదీ వరకు ప్రత్యేక బస్సులను నడుపుతామన్నారు. ప్రస్తుతం మూడు బస్సు సర్వీసులను ప్రారంభించామని, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అవసరమైతే అదనపు సర్వీసులను నడుపుతామని చెప్పారు. ఆత్మకూరు నుంచి సింగోటానికి పిల్లలకు రూ.140, పెద్దలకు రూ.275 చొప్పున చార్జీలు ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని సింగోటం జాతరకు వెళ్లే భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గోరుకల్లు పొట్టేలు విజేత

పగిడ్యాల: సంక్రాంతి తిరుణాలను పురస్కరించుకుని పడమర ప్రాతకోట కాశీవిశ్వేశ్వర, నందీశ్వర స్వామి దేవాలయం వద్ద శనివారం రాత్రి నిర్వహించిన జిల్లా స్థాయి రెండు పళ్ల పొట్టేలు పందెం పోటీలను ఎస్ఐ నాగార్జున ప్రారంభించారు. పోటీల్లో జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి 14 జతల పొట్టేళ్లు పాల్గొన్నాయి. ప్రాతకోట శ్రీకాంత్ పొట్టేలు, గోరుకల్లు మణికి చెందిన పొట్టేళ్లు పోటా పోటీగా ఢీకొన్నాయి. చివరకు గోరుకల్లు మణి పొట్టేలు విజేతగా నిలిచి మొదటి బహుమతిని సొంతం చేసుకుంది. రెండవ విజేతగా ప్రాతకోట శ్రీకాంత్ పొట్టేలు నిలిచింది. మూడవ విజేతగా దామగట్ల లడ్డు పొట్టేలు నిర్వాహకులు ప్రకటించారు. గెలుపొందిన పొట్టేళ్ల యజమానులకు వరుసగా రూ. 4 వేలు, రూ. 2 వేలు, రూ. వెయ్యి నగదు బహుమతిని నందికొట్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మండల కో ఆప్షన్ మెంబర్ అస్లాంబాషా, సహకార సొసైటీ డైరెక్టర్ దివాన్‌సాహెబ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పుల్లారెడ్డి, నాగేశ్వరరెడ్డి, మిద్దె మోక్షం, రమణ ప్రసాద్, అంబటి శివశంకర్‌రెడ్డి, కురువ మల్లయ్య, అలీబాషా, అమీర్‌బాష తదితరులు పాల్గొన్నారు.


పోటాపోటీగా తలపడుతున్న పొట్టేళ్లు

రైతుల మోములో ఆనందం


ఆళ్లగడ్డ గ్రామంలో రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

గడివేముల: వైఎస్సార్‌సీపీ పాలనలో రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోందని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని ఆళ్లగడ్డ గ్రామంలో సంక్రాంతి, మౌలాలి స్వామి ఉరుసును పురస్కరించుకుని రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎమ్మెల్యే కాటసాని ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో ప్రతి ఏటా రైతు సంబరాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయన్నారు. రైతులు రెండు కార్ల పంటలు పండించుకుంటున్నారని చెప్పారు. జిల్లాలో కేసీ కెనాల్ ద్వారా చివరి ఆయకట్టుకు కూడా సాగునీరు అందిస్తున్నామన్నారు. అనంతరం కొంతసేపు రైతులతో ముచ్చటించారు. అంతకు ముందు గ్రామస్తులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ చంద్రశేఖరరెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచ్ బాలచెన్ని, వైఎస్సార్‌సీపీ నాయకులు రమణారెడ్డి, సర్వేశ్‌రెడ్డి, పెసరవాయి శ్రీకాంత్‌రెడ్డి, దేశం నాగేశ్వరెడ్డి, సీపీ రమణయ్య, సంజీవరెడ్డి, రఘుమాధవరెడ్డి, వెంకటక్రిష్ణారెడ్డి, రవీంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, సునీల్‌కుమార్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విజేతగా నిలిచిన రోళ్లపాడు ఎద్దులు

పోటీల్లో మిడ్తూరు మండలం రోళ్లపాడుకు చెందిన డాక్టర్ పేరెడ్డి ప్రభాకరరెడ్డి ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచి రూ.30 వేల నగదు బహుమతి గెలుచుకున్నాయి. రెండో బహుమతి రూ. 20 వేలు వైఎస్సార్ జిల్లా చిపాడు గ్రామానికి చెందిన ఆర్‌కే బుల్స్ అధినేతలు బంగూరు అనుషారెడ్డి,వీరాతేజరెడ్డి వృషభాలు, మూడు బహుమతి రూ. 10 వేలు పాములపాడు మండలం తుమ్మలూరు గ్రామానికి చెందిన పల్లవి ఎద్దులు, నాలుగో బహుమతి రూ.5 వేలు ఆళ్లగడ్డ మండలం కోటకందుకూరు గ్రామానికి చెందిన నరసింహారెడ్డి వృషభాలు గెలుచుకున్నాయి.

సౌత్ జోన్ షూటింగ్‌లో గిరిజన విద్యార్థుల ప్రతిభ

కర్నూలు(అర్బన్): ఈ నెల 12, 13వ తేదీల్లో విజయవాడలో జరిగిన రెండో జూనియర్ సౌత్ జోన్ షూటింగ్ బాల్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారని స్థానిక ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివకృష్ణ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న అభిషేక్, సతీష్ అనే విద్యార్థులు క్రీడల్లో కనబరుస్తున్న ప్రతిభను గుర్తించి పాఠశాల పీఈటీ రమ్యకృష్ణ ప్రత్యేక శిక్షణను అందించారన్నారు. ఈ నేపథ్యంలోనే తమ విద్యార్థులు చూపిన ప్రతిభతో ఆంధ్రప్రదేశ్ జట్టు మొదటి స్థానంలో విజయం సాధించిందన్నారు. మారుమూల గ్రామాలకు చెందిన తమ విద్యార్థులు సౌత్ జోన్‌లో గుర్తింపు పొందడం చాలా సంతోషంగా ఉందని, ఇందుకు సహకరించిన పీఈటీ, ఇతర ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోండి

కర్నూలు(సెంట్రల్): సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత అంబులెన్స్ సేవలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు కోరారు. శనివారం కేంద్రం ఏర్పాటు చేసిన ఉచిత అంబులెన్స్ సర్వీసును కలెక్టరేట్ ప్రాంగణంలో ఆయన ప్రారంభించి మాట్లాడారు. సుందరయ్య స్ఫూర్తి కేంద్రం సేవలు అభినందనీయమన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ ఉచిత కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేసిందన్నారు. ప్రజలకు అంబులెన్స్ అందుబాటులోకి తేవడం గొప్ప విషయమన్నారు. అంబులెన్స్ దాతలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో చైర్మన్ కె.ప్రభాకరరెడ్డి, రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, వైద్యుడు డాక్టర్ శంకర్ శర్మ, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.


అంబులెన్స్ సర్వీసును ప్రారంభిస్తున్న డీఆర్వో నాగేశ్వరరావు